ప్రజాశక్తి
గురువారం 18 డిసెంబర్ 2025
8 పేజీలు






ఎన్‌టిఆర్ కృష్ణా

పల్లెలకు నీటి కష్టాలు

- నేటికీ వాటర్ ప్లాంట్లపైనే ఆధారం
- తాజాగా రూ.5,947 కోట్లతో వాటర్ గ్రిడ్‌కు సమగ్ర నివేదిక



ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

జలజీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రజలకు సురక్షిత నీరు అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ కార్యాచరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కూటమి అధికారం చేపట్టిన 18 నెలల తర్వాత రూ.5,947 కోట్లతో వాటర్ గ్రిడ్‌కు సమగ్ర నివేదిక తయారు చేశారు. అయితే నిధులు విడుదలపై స్పష్టత రాకపోవడంతో పల్లె ప్రజలకు సురక్షిత నీరు ఎప్పటికి అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంగా ఉన్న బంటుమిల్లి పంచాయతీలో ఏడు వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. పంచాయతీ సరఫరా చేస్తున్న చెరువులోని నీటిని తాగునీటి అవసరాలకు ఉపయోగించేవారు అరుదు. 70 శాతం ప్రజలు వాటర్ ప్లాంట్లలో నీరు కొనుక్కుని తాగుతున్నారు. నలుగురున్న కుటుంబం 20 లీటర్ల డబ్బా నీటిని కొనుగోలు చేసేందుకు రోజుకు సగటున రూ.15 ఖర్చు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంపిణీ అయిన సెంటున్నర స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న 200 కుటుంబాలు తాగునీరు కొనుగోలు చేస్తున్నారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న చెరువు నీరు తాగేందుకు పనికి రావడం లేదని, ఆరోగ్య సమస్యలు వస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని తీర ప్రాంత, ఆక్వా చెరువులు విస్తరించిన నందివాడ మండలాల్లోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుండి కాలువల ద్వారా వస్తున్న నీరు అనేక వ్యర్థాలతో కలుషితం అవుతున్నాయి. జిల్లాలోని 266 మంచినీటి చెరువులను ఈ నీటితోనే నింపుతున్నారు. నీటి సరఫరాలో లోపాలతో కొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు అతిసార ప్రబలుతోంది. గత ఎన్నికల్లోనూ కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ నిధులతో (మిగతా 2లో)



ఎఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగార్జున

ఉన్నత భవిష్యత్తుకు 'ఎఎన్ఆర్' బాటలు

- వజ్రోత్సవ వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి దేవానంద్
- విద్యార్థుల స్కాలర్‌షిప్‌కు నాగార్జున రూ.2 కోట్లు విరాళం

ప్రజాశక్తి-గుడివాడ: మహోన్నత ఆలోచనతో ఏర్పడిన ఎఎన్ఆర్ కళాశాల ఎందరికో మంచి భవిష్యత్తు అందించిందని, తాను ఈ కళాశాలలో చదివే ఈ స్థాయికి ఎదిగానని హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ అన్నారు. గుడివాడలోనిఎఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవాలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సినీ నటుడు అక్కినేని నాగార్జున మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు, అన్నపూర్ణమ్మ పేర్ల మీద కళాశాల విద్యార్థుల స్కాలర్షిప్ కోసం రూ.2 కోట్లను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఎఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం (మిగతా 2లో)

పాముకాటుకు రైతు మృతి



ప్రజాశక్తి-నాగాయలంక: పాముకాటుకు రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పర్ర చివర గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పర్ర చివర గ్రామానికి చెందిన ఆరేవరపు వీరరాఘవయ్య (42) బుధవారం ఉదయం తన పొలంలో పని చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. దీనిని గమనించిన స్థానికులు నాగాయలంక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పగించిన మృతిచెందినట్లు ధ్రువీకరించాడు. వీరరాఘవయ్య కూలీ పనులు చేసుకుంటూ వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

112 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేయాలని చూసినా, వారికి సహకరించినా ఉపేక్షించేదిలేదని ఎస్‌పి వి.విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. బుధవారం జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని బిబి గూడెం అండర్‌పాస్ వద్ద గన్నవరం ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారని, ఆ సమయంలో ఓ కారును ఆపి తనిఖీలు చేపట్టగా ఆ కారులో సుమారు రూ.5.60 లక్షల విలువ కలిగిన 112 కిలోల గంజాయిని గుర్తించారని తెలిపారు. వెంటనే పూణేకు చెందిన దీపక్‌తుపేను అదుపులోకి తీసుకుని విచారించగా పూణేకు చెందిన వైష్ణవి లవన్‌కు గంజాయి కోసం ఒరిస్సా రాష్ట్రంలోని బలంగిర్‌లో రాజ్‌కుమార్, సురాన్ కర్ణ వద్ద కొనుగోలు చేసి తీసుకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నాడని చెప్పారు.. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం, రవాణాను జిల్లాలో ఎక్కడా జరగనివ్వకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. కేవలం రవాణాదారుల్ని మాత్రమే కాక విక్రయిస్తున్న వారిని, సరఫరా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకునేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు, ఈగల్ టీం 1972 హెల్ప్ లైన్ నెంబర్‌కి సమాచారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు వివి నాయుడు, బి.సత్యనారాయణ, గన్నవరం డిఎస్పి సిహెచ్.శ్రీనివాసరావు, సిఐ శివ ప్రసాద్, ఈగల్ టీం సీఐ ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

హామీలకు విరుద్ధంగా స్మార్ట్ మీటర్లు

- రిపేర్ల సాకుతో బిగించేందుకు కుట్ర
- కనెక్షన్లు తొలగిస్తామని ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు



నోటీసులను చూపుతున్న బాబూరావు, కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు విరుద్ధంగా స్మార్ట్‌మీటర్లను బిగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్‌తో కలిసి బాబూరావు విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఇచ్చిన నోటీసులను తక్షణమే రద్దు చేయాలని, ఇప్పటికే పెట్టిన మీటర్లు తొలగించాలని, అదానీ కంపెనీతో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా, ప్రజలకు నష్టం చేకూర్చే స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా సిపిఎం, వామపక్షాలు ప్రజలందరితో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌ను అదానీప్రదేశ్‌గా సర్కార్ మారుస్తోందని, రాష్ట్రంలో రెండు కోట్ల మంది వినియోగదారులకు బాగున్న మీటర్లు తొలగించి, స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నేతలు నేడు బలవంతంగా మీటర్లు బిగిస్తుండటం దారుణమన్నారు. విజయవాడలో విద్యుత్ కనెక్షన్లు నిలిపివేస్తామంటూ నోటీసులు ఇస్తున్నారని, బలవంతంగా స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు చూస్తున్నారని తెలిపారు. మీటర్ల రిపేరు సాకుతో (మిగతా 2లో)

ఆశల పూత చిగురించేనా..?

లేటలు రావడంతో మామిడి రైతుల్లో ఆందోళన



చెట్లకు పూత వచ్చేందుకు మందు పిచికారీ చేస్తున్న రైతు

ప్రజాశక్తి-మైలవరం

ప్రతికూల వాతావరణ పరిస్థితులు మామిడి రైతులను వెంటాడుతున్నాయి. మార్చి నెల చివరికల్లా కాయలు దిగుమతి కావాల్సి ఉన్నా నేటికీ తోటల్లో పూత కనిపించకపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. డిసెంబర్ నెల పూర్తవుతున్నా పూతతో కళకళ్లాడాల్సిన చెట్లు వెలవెలబోతున్నాయి. గతేడాది పండు ఈగ, తెగుళ్లతో తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతుకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పేటట్లు కనిపించడంలేదు. పూత రావాల్సిన తోటలకు లేటలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లేటలు వస్తే ఇక పూత రాదని అంటున్నారు. సాధారణంగా నవంబర్ ప్రారంభం నుంచి మామిడి పూతలు రావాల్సి ఉన్నా నేటికీ 70 శాతానికి పైగా మామిడి తోటల్లో పూత కనిపించడంలేదు. మందులు రెండు మూడుసార్లు పిచికారీ చేసినా పూత రావడంలేదని రైతులు వాపోతున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 22.896 హెక్టార్లలో మామిడిని సాగు చేస్తున్నారు. మైలవరం మండలంలో 3,353 హెక్టార్లలో, రెడ్డిగూడెం 4,450 హెక్టార్లలో, జి.కొండూరు 3,234 హెక్టార్లు, విసన్నపేట 5,817 హెక్టార్ల, ఏ కొండూరులో 2,386 హెక్టార్లు, విజయవాడ రూరల్ 1,952 హెక్టార్లలో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి పూత రావడం కష్టంగా ఉంది. అధిక వర్షాల వల్ల తోటలు ప్రస్తుతం లేటలు వస్తున్నాయి. అక్కడక్కడ పూత కనిపిస్తున్నా పిందెకట్టు అయ్యే సమయానికి ఉన్న పిందెలు కాస్త మాడిపోయే ప్రమాదం ఉంది. డిసెంబర్ పూర్తవుతున్నా 30 శాతం తోటల్లో కూడా పూత రాలేదు. దీంతో పూత కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

హామీలకు విరుద్ధంగా స్మార్ట్ మీటర్లు

స్మార్ట్ మీటర్లు బిగించడం మోసపూరితమన్నారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు, సోలార్ కనెక్షన్లకు బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించడం శోచనీయమన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం 18 నెలల్లో రూ. 24 వేల కోట్లు సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం ఇతర రూపాల్లో వేల కోట్లు అదనపు భారాలు మోపిందన్నారు. ఇవి చాలవన్నట్లుగా మరో రూ.12,717 కోట్ల ట్రూఅప్ ఛార్జీల విధింపునకు రంగం సిద్ధమైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్‌కు అయ్యే ఖర్చు రూ.8 వేల నుండి 15 వేల వరకు వినియోగదారులపై వేసి 93 నెలల్లో వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారని చెప్పారు. విద్యుత్ వ్యయం తగ్గిస్తామని, ఛార్జీలు, భారాలు తగ్గిస్తామని ఎన్నికలకు ముందు మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు స్మార్ట్ మీటర్ల ద్వారా వ్యయం పెంచడం, ప్రజలపై భారం మోపటం మోసపూరితం కాదా అని ప్రశ్నించారు. వీటికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ ప్రతిఘటించి తిప్పికొట్టాలని, అధికార పార్టీ ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి స్మార్ట్ మీటర్లపై స్పందించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఇచ్చిన నోటీసులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

ఉన్నత భవిష్యత్తుకు 'ఎఎన్ఆర్' బాటలు

సంతోషంగా ఉందన్నారు. మనుషులు శాశ్వతం కాదని వారు చేసే పనులే శాశ్వతమని, ఎఎన్ఆర్ చదువుకోలేకపోయినా వేలాది మంది భవిష్యత్తు కోసం నాగేశ్వరరావు స్థాపించారని, రైతు బిడ్డ అయిన నాగేశ్వరరావుకు చదువు అంటే ఎంతో ఇష్టమని అన్నారు. సినిమాకు రూ.5 వేలు వచ్చే ఆ రోజుల్లోనే లక్ష రూపాయలు కళాశాలకు విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఎఎన్ఆర్ కళాశాలలో చదివిన విద్యార్థులు నేడు దేశ, విదేశాల్లో ఎంతో ఉన్నత స్థానాల్లో నిలవడం సంతోషకరమన్నారు. తన కుటుంబం తరపున ప్రతి ఏటా విద్యార్థులకు స్కాలర్షిప్‌లను అందిస్తామన్నారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన ఎఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, అక్కినేని పెద్ద కుమారుడు, కుమార్తె వెంకట్, సుశీల, మాజీ మంత్రి కావూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు నీటి కష్టాలు

ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి, సురక్షిత నీరు అందిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుండి పైప్ లైన్ ద్వారా ప్రజలకు సురక్షిత నీరు అందించడానికి ప్రణాళికలు రూపొందించారు. దీనికి మొత్తం రూ.5947 కోట్లు వ్యయం అవుతుందని సమగ్ర నివేదిక రూపొందించారు.

నిధులపై స్పష్టత నిల్

డిపిఆర్ కార్యరూపం దాల్చడానికి ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. కేటాయింపులు పూర్తయిన తర్వాత టెండర్ల ఆహ్వానం, దీనికి అనుగుణంగా పనులు ప్రారంభమవుతాయి. అయితే నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడంతో వాటర్ గ్రిడ్ ఎప్పటికి పూర్తవుతుందో.. సురక్షిత నీరు గ్రామీణ ప్రజలకు ఎప్పటికి అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ: పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ 2026 నూతన సంవత్సర కేలండర్‌ను సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ చైతన్య బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. శిరీష మాట్లాడుతూ పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ కేలెండర్‌లో తాము చేసిన ఎన్నో సేవా కార్యక్రమాలను పొందుపరిచామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కందుల పరమేశ్వర రావు, ట్రస్ట్ సభ్యులు వసుధ ఝాన్సి, లెనిన్, శానంపూడి కె నరేంద్ర, రత్నం చిట్టిబాబు, రత్నం పాల్గొన్నారు.



కోతులు, అడవి ఆవుల సమస్యపై దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టీఆర్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ కోతులు ప్రజల్ని కలవరపెడుతున్నాయని, నందిగామలో అడవి ఆవులు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం కలెక్టర్ల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కోతులు, అడవి ఆవుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ఉన్న మార్గాలపై పంచాయతీరాజ్, రెవెన్యూ, పశుసంవర్ధక, అటవీ మున్సిపల్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు ఆదేశాలిచ్చారన్నారు.

ఆశల పూత చిగురించేనా..?

నవంబర్లో పూత వస్తే మార్చి నెలలో కాయలు కోయడానికి వస్తాయి. దీంతో టన్ను రూ.70 వేలకు పైగానే ధర ఉంటుంది. గతేడాది ప్రారంభంలో మామిడి టన్ను లక్ష రూపాయలకు పైగానే ఉంది. ఆ తర్వాత తెగుళ్లు, వర్షాలకు కాయలు కొనే నాథుడే లేకపోవడంతో పారబోయాల్సి వచ్చింది. ప్రస్తుతం రెడ్డిగూడెం, విసన్నపేట, చాట్రాయి, గంపలగూడెం మండలాల్లో కొన్ని తోటల్లో మాత్రమే ముందస్తుగా పూతలు వచ్చాయి. ఆ పూతలను నిలుపుకోవడానికి రైతులు పైమందులను పిచికారి చేస్తున్నారు.

లేటలు వస్తున్నాయి : వజ్రాల వెంకటరెడ్డి, రైతు

ఈ ఏడాది పూత రావాల్సిన సమయంలో లేటలు వస్తున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోతాం. ఇప్పటివరకు ఎకరానికి 25 వేల నుంచి 30 వేల వరకు ఖర్చయ్యింది. వ్యాపారస్తులు కూడా రావడం లేదు. ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు : బాలకృష్ణారెడ్డి, రైతు

మామిడిపై ఎన్నో ఆశలు పెట్టుకుంటే ప్రతి ఏడాది నష్టాలే మిగులుతున్నాయి. పెట్టుబడులు కూడా రావడం లేదు. పూత ఆలస్యంగా రావడంతో కాయలు కూడా ఆలస్యంగా వస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల కాయలు నేలరాలుతున్నాయి. దీంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. మామిడిని తొలగించి ప్రత్యామ్నాయ పంటలు వేయాలని అనుకుంటున్నాం.

మెరుగైన ఫలితాలు సాధించేలా దృష్టి సారించాలి : డిఇఒ

ప్రజాశక్తి- మచిలీపట్నంరూరల్ : నూరుశాతం మెరుగైన ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి యువి. సుబ్బారావు తెలిపారు. జిల్లాలో అమలవుతున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని పరిశీలినలో భాగంగా మచిలీపట్నం మండలంలోని తవిసిపూడి జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ అయిన మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంపొందించడం, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా లక్ష్య నిర్ధారణతో బోధన జరగాలన్నారు. రోజువారీ పాఠ్య ప్రణాళికలు,వారాంతపు మూల్యాంకనలు, నోట్స్ సరిదిద్దు విధానం పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యాస పురోగతిని వ్యక్తిగతంగా గమనించి అవసరమైన చోట రీమిడియల్ బోధన చేపట్టాలని, ముఖ్యంగా పదవ తరగతిలో పాస్ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో క్రమశిక్షణ, హాజరు శాతం, బోధన నాణ్యత మెరుగుపడేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.



గుడ్లవల్లేరు పీహెచ్‌సీ తనిఖీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రసవాల నిర్వ హణలో గుడ్లవ ల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లాలోనే టాప్‌టెన్‌లో ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.యుగంధర్ అన్నారు. గుడ్లవల్లేరు పీహెచ్‌సీని బుధవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ఆసుపత్రిలో ఎప్పుడూ జరిగే విధంగానే ప్రసవాలు జరిగే విధంగా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. గుడ్లవల్లేరు పీహెచ్‌సీ జిల్లాలోని మొదటి పది స్థానాల్లో ఉన్నారు. అదే విధంగా కొనసాగించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో జిమందుల పంపిణీ, ట్రాయిలర్, స్కానర్, రోగులు వెయిట్ చేసే ప్రాంతాలతో పాటు వార్డులను ఆయన పరిశీలించారు. స్టాఫ్ నర్స్ దివ్య, సిబ్బంది ఉన్నారు.

కార్మికుని కుటుంబానికి పరిహారం ఇవ్వాలని ధర్నా



ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణంలో బుధవారం భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు కాటూరి రాము (42) జారిపడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం నాయకులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా, నిర్మాణ సంస్థ యాజమాన్యం 2.50 లక్షలు, కాంట్రాక్టర్ (మేస్త్రి) బాషా 1.50 లక్షలు మొత్తం 4 లక్షల నష్టపరిహారం ఇవ్వడానికి అంగీకరించి, ముందుగా ఒక లక్ష రూపాయల నగదు అందజేశారు. ఈ నష్టపరిహారం అంగీకారంతో కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు ఆందోళన విరమించారు. ఆత్కూరు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి,మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్ట్ మార్టం చేయించి బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ కార్యక్రమం లో, సిపిఐ(ఎం) ఉంగుటూరు మండల పార్టీ కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, నాయకులు కడవకొల్లు రామరాజు, టివి రామ్మోహన్ రావు, సలీం,జోజి, జ్యోతి, మరియు కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.



నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : పెద్ద కర్రగ్రహారం కోదండ రామస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా పెదసింగు సామేరు, కమిటీ సభ్యులుగా బొర్రా రాము, పడమట నాగేంద్రం, పరసా వెంకటేశ్వరరావు, పరసా అంకాలు, పరసా ప్రసాద్, కట్టా రవికుమార్, తోట సాయి, నల్ల గోపుల అమ్మాజీ లు ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం ప్రాంగణంలో జరిగినఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, ఆక్వా కల్చర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, లంకె నారాయణ ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్, కుంచే నాని, గవర్నమెంట్ హాస్పటల్ మాజీ చైర్మన్, తలారి సోమశేఖర్, జనసేన నాయకుడు, తోట భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల గుంటూరు జిల్లాలోని ఎస్.ఎన్. ప్రభుత్వ హైస్కూల్‌లో ఈనెల 13,14 తేదీలలో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 45వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విద్యావికాస్ పాఠశాల పిఇటి వెలగా సుధాకర్ విశేష ప్రతిభ కనబరచడం అభినందనీయమని విద్యావికాస్ స్కూల్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక బైపాస్‌రోడ్డులోని విద్యావికాస్ పాఠశాలలో పిఇటి సుధాకర్‌ను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పోటీలలో 5 కిలోమీటర్ల రన్నింగ్, 5 కిలోమీటర్ల వాకింగ్ విభాగాల్లో రెండు గోల్డ్ మెడల్స్, హ్యామర్ త్రో విభాగంలో ఒక సిల్వర్ మెడల్ సాధించి విద్యావికాస్ విద్యా సంస్థకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకటి నుండి లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : పెన్షన్‌దారులు ప్రతి ఏడాది లాగానే కొత్త సంవత్సరం 2026 జనవరి 1 నుండి ఫిబ్రవరి నెల ఆఖరి లోపు వార్షిక ధ్రువీకరణ పత్రము (లైఫ్ సర్టిఫికెట్) డిజిటల్ పద్ధతిలో ఫేస్ ఆఫ్(ఎఫ్ ఆర్ ఎస్) బయోమెట్రిక్ జీవన్ పోర్టల్ ద్వారా నిర్ణీత గడువులోపు అందించాలని సబ్ ట్రెజరీ కార్యాలయం అధికారి అనీష్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్ నమోదు కొరకు ఆధార్ కార్డు, ఓటిపి కొరకు సెల్ఫోన్, పెన్షన్ బుక్కు, బ్యాంకు ఖాతా నెంబరు వివరములు తీసుకొని ఉపకజానా కార్యాలయంలో కానీ ఆన్లైన్ సెంటర్‌లో కానీ వారి వివరాలు అన్ని లైఫ్ సర్టిఫికెట్ లో నమోదు చేసుకోవాలని ఎస్‌టిఓ కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఐ టీవీవీ రామారావు

రోడ్డు నిబంధనలతో ప్రమాదాల నివారణ : సిఐ

ప్రజాశక్తి-ఉయ్యూరు : రోడ్డు నియమ, నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. ఏజి అండ్ ఎస్ కళాశాల స్వర్ణోత్స వాలు పురస్కరించుకుని కళాశాలలో ఆవరణలో బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులకు పలుసూచనలు చే శారు. ద్విచక్రవాహనం నడిపేసమయంలో హెల్మెట్, కారు నడిపే సమయంలో సీటు బెల్టు తప్పక ధరించాలన్నారు. అతి వేగం ప్రమాదకరంతో పాటు ఒక్కొక్కప్పుడు ప్రాణాంతకమవు తుందన్నారు. మొబైల్లోను మాట్లాడుతూ వాహనం నడపడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితె తెచ్చుకుని విలువైన ప్రాణం మీదకు తెచ్చుకో వద్దన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తా మని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ నందం వసంతరావు అధ్యక్ష తన జరిగిన సదస్సులో ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ కె. శేఖర్ బాబు పాల్గొన్నారు.



మోపిదేవి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మోపిదేవి : రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ యువజన మాసోత్సవాలలో భాగంగా కూచిపూడి రోటరీ క్లబ్ వారు ఈనెల 15 ,16 తేదీలలో పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన బాలికల టగ్ ఆఫ్ వార్ పోటీలలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోపిదేవి బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించి మూడు వేల రూపాయల నగదు బహుమతి సర్టిఫికెట్స్, మెమెంటో గెలుచుకున్నారు. వీరిని జడ్పిటిసి శ్రీ మెడబలి మి మల్లికార్జున, ఎంపీపీ రావి దుర్గావాణి , పాఠశాల అభివృద్ధి కమిటీ కోశాధికారి శ్రీ రావి నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానో పాధ్యాయిని, పోలవరపు జయంతి విద్యార్థినులను అభినందించారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి : ఎంపిడిఒ



ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీన నిర్వ హించే పల్స్ పోలియో కార్యక్రమంపై మండల స్థాయి భూత్ వాలంటీర్లకు బుధవారంశిక్షణ నిర్వహిం చారు. ఎంపీడీవో ఎం. మరియా దేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచిం చారు. మండలంలో ఉన్న 32 పోలియో బూతుల్లో వాలంటీర్లు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకుడు కె. తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

కార్పొరేటర్ మాధురి లావణ్య

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలోనూ, భవానీ దీక్షలో విరమణ సందర్భంగా పారిశుధ్యంను కాపాడడంలో పారిశుధ్య కార్మికుల కృషి ప్రశంసనీయమని 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య ప్రశంసించారు.



45వ డివిజన్ సచివాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో డివిజన్లోని 41 మంది పారిశుధ్య కార్మికులకు కార్పొరేషన్ అందజేసిన నూతన వస్త్రాలతోపాటుగా తన సొంత ఖర్చుతో ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యంను కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా మాధురి లావణ్య మాట్లాడుతూ పారిశుధ్య పరిరక్షణ ప్రజలందరి బాధ్యతగా గుర్తించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం నాయకులు మైలవరపు కృష్ణ మాట్లాడుతూ భవాని దీక్షల విరమణను ఎంపీ కేశినేని చిన్ని, ఎంఎల్ ఎ సుజనా, కలెక్టర్ లక్ష్మీశా, దుర్గగుడి ఈవో శీనా నాయక్ తదితరులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని చక్కగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ జి. శివకుమార్, పాల్గొన్నారు.

భాషా నైపుణ్యాలతో ఉత్తమ భవిష్యత్తు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : మాతృభాషలో చక్కటి భావ వ్యక్తీకరణ, రచన నైపుణ్యాలు సాధించడం ద్వారా ఇతర భాషల్లో పట్టు సంపాదించడం తేలిక అవుతుందని, తద్వారా ఉత్తమ భవిష్యత్తు సాధించవచ్చని ప్రముఖ సాహితీవేత్త వాడ్రేవు సుందరరావు అన్నారు. కె.బి.ఎన్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న లేఖా రచన, ఉపన్యాస కళ కార్యశాల (వర్క్ షాప్) బుధవారం ప్రారంభమైంది. ప్రధానవక్తగా పాల్గొన్న సుందరరావు మాట్లాడుతూ మనలోని భావాలను నేర్పుగా, ఓర్పుగా, తేలికగా అవతలి వ్యక్తికి తెలియజేయడం గొప్ప కళ అని, భావ వ్యక్తీకరణ నైపుణ్యాల ద్వారా చదువుకున్న విద్యకు అదనపు విలువ చేకూరుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ మాతభాషలో శ్రవణ, భాషణ నైపుణ్యాలు ప్రతి విద్యార్థికీ ఉత్తమస్థాయిలో ఉండాలనే లక్ష్యంతో కార్యశాల ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి.నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ వి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

చిత్రకారుడు జగన్మోహనరావుకు అవార్డు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్మోహనరావుకు హైదరాబాద్‌కు చెందిన సూర్య చంద్ర కల్చరల్ ఆర్గనైజేషన్ వారి ప్రతిష్టాత్మకమైన ట్రైబల్ ఆర్ట్ లెజెండ్ అవార్డు లభించింది. భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసం



ఉంటున్న ఆయన బుధవారం కొరియర్ ద్వారా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ గిరిజనుల జీవితాలను ప్రపంచానికి వివరిస్తూ తాను చిత్రించిన చిత్రాలకు గాను ఈ అవార్డు రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. సమాజంలోని వివిధ అంశాలను సృజిస్తూ తాను చిత్రించిన అనేక చిత్రాలకు ఇప్పటివరకు 250 కి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించడం తన అదష్టంగా భావిస్తున్నానని చెప్పారు. జగన్మోహనరావుకు అవార్డు రావడం పట్ల పలువురు చిత్రకారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

ఇష్టపడి చదివితే ఏదైనా సాధ్యమే

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : గణితం అంటే భయం వద్దని, ఇష్టపడి చదివితే ఏదైనా సాధ్యమని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామ నారాయణ అన్నారు. గాంధీనగర్‌లోని శారద డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు బుధవారం కళాశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు గణితంపై పోటీలను నిర్వహించారు. నగరంలోని 22 పాఠశాలల నుండి 210 మంది విదార్థులు పాల్గొన్నారని కుందా రామ నారాయణ తెలిపారు. విద్యార్థులు ముందు భయాన్ని వీడి సబ్జెక్టుపై మక్కువ పెంచుకోవాలన్నారు. గౌతం స్కూల్ అధినేత ఎస్.సూర్యారావు మాట్లాడుతూ విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించటానికి పోటీలు నిర్వహిస్తున్న శారద కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో శారద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వర శర్మ, కళాశాల కో ఆర్డినేటర్ వై. వి. కె.సత్యానందు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ల నిర్వహణకు అనుమతి తప్పనిసరి : ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : ఎగ్జిబిషన్‌కు అనుమతి కావాలంటే భద్రతా చర్యలు కచ్చితంగా పాటించాలని విజయవాడ ననగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విఎంసిలోని నగర కమిషనర్ చాంబర్‌లో ఎగ్జిభిషన్‌నిర్వహుకులు, సంబంధిత శాఖాధిపతులతో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...విజయవాడ నగర పరిధిలో ఎగ్జిభిషన్, ఉత్సవాలు, ఇతర ఈవెంట్లు నిర్వహించుకోవడానికి విజయవాడ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందడానికి సంబంధిత రక్షణ భద్రతా చర్యలు పాటించాలని కోరారు.అందులో భాగంగా ముందుగా వారి ప్లాన్‌ను సమర్పించాలని, ఆ ప్లాన్‌కు విఎంసి నుంచి అనుమతి పొందాక, ప్లాన్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాక, ఎటువంటి అగ్ని ప్రమాదం జరగకుండా అగ్ని మాపక నిరోధక పరికరాలు ఉన్నాయా లేవా అని విఎంసి ఫైర్ ఆఫీసర్లు,



ప్రజారోగ్య శాఖ , పారిశుధ్య నిర్వహణకు తీసుకున్న చర్యలు పరిశీలించి, ట్రేడ్ లైసెన్స్, నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ల జారీ చేయాలి అన్నారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ కె సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ ఎ శ్రీధర్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎగ్జిభిషన్ నిర్వహుకులు, యూనియన్ సెక్రటరీ నందివాడ గోపి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తారా?

• కామరాజ్ హరీష్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డిపై రాష్ట్ర నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ కె నాగూర్ మీరా చేసిన వ్యాఖ్యలను ఎన్‌టిఆర్ జిల్లా వైసిపి అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ ఖండిస్తూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భవానీపురం జ్యోతినగర్ 42 ప్లాట్ల యజమానులకు అన్యాయం జరిగిన మాట వాస్తవమే అయినప్పుడు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాలనుకుంటున్న కూటమి నేతలు వారికి ఏ విధంగా న్యాయం చేస్తారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ముమ్మాటికీ ఎంపీ కేసినేని శివనాథ్ కి సంబంధం ఉందని ఆరోపించారు.

పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలంలో పనిచేస్తున్న ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-1 కార్యదర్శులుగా పదోన్నతి లభించినట్లు ఎంపీడీవో సిహెచ్ రవిబాబు తెలిపారు. మునుకుళ్ళ పంచాయతీ కార్యదర్శి వెంపాటి రవికుమార్ ను పదోన్నతిపై విస్సన్నపేట మండలం పుట్రేలలో నియమించారని, గానుగపాడు కార్యదర్శి ఫణిగోపాల్, ముష్టికుంట్ల కార్యదర్శి మీరాలకు కూడా పదోన్నతి లభించిందని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

ప్రజాశక్తి - ఏ. కొండూరు : దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి తప్పనిసరిగా స్మరించుకోవాల్సిన అవసరం ఉందని మండల విద్యాశాఖ అధికారి ఈ.ఎల్.సి.కేశవరావు అన్నారు. కోడూరు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ రాసిన "అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ -షేక్ మదీనా" పుస్తకాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించి విద్యార్థులకు పరిచయం చేశారు. ఎందరో ప్రాణ త్యాగం చేసిన ఫలితంగా దేశానికి స్వాతంత్రం వచ్చిందని, వారి స్ఫూర్తితో విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శరత్ బాబు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎం.రాంప్రదీప్, ఉపాధ్యాయులు బి.నాగేంద్రరావు, వి. తేజస్విని, వి.జయశ్రీ, టి. సుప్రియ పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండలం జుజ్జూరులో బుధవారం ఎంపీపీ కోటేరు లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యంపై సభ్యులు అధికారులను నిలదీయగా.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని అధికారులు సమాధానమిచ్చారు. గతంలో నిర్మించిన పక్కా గృహాలకు నేటి వరకు బిల్లు రాలేదని తెలపడంతో జగనన్న గృహాలకు బిల్లులు అవుతున్నాయని హౌసింగ్ శాఖ ఎఇ సమావేశంలో వివరించారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ మాట్లాడుతూ ఉపాధి పథకం కింద మండలానికి సిసి రోడ్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

విఆర్ఏ వెంకయ్య మృతి



విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం కుందావారి కండ్రిక గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) నున్న వెంకయ్య (80) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నున్నలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. 1983లో కుందావారి కండ్రిక గ్రామ మోతాదుగా (ప్రస్తుతం వీఆర్ఏ) రెవెన్యూశాఖలో చేరారు. సుమారు 42 సంవత్సరాలుగా ఆయన అదే గ్రామంలో సేవలందించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో ఇంట్లోనే మృతి చెందారు. వెంకయ్య మృతి వార్త తెలియగానే విజయవాడ రూరల్ మండల తహశీల్దార్ బీ సుగుణ ఇతర రెవెన్యూ సిబ్బంది ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం నున్నలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. వీఆర్ఏ వెంకయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ నజీర్ అహ్మద్ రచించిన 'అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ -షేక్ మదీనా' పుస్తకాన్ని అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్లా చిస్తి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల పాత్రపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, మండల కార్యదర్శి చాట్ల రవి, ప్రజాశక్తి రిపోర్టర్ షేక్ లాల్ అహ్మద్ గౌస్, షేక్ జానీ సాహెబ్, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు షేక్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు

రైల్వేలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భారతీయ రైల్వేలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని నేషనల్ ఫెడరేషన్ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జాతీయ ప్రధాన



కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో నిర్వహించిన 229వ వర్కింగ్ కమిటీ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 8వ వేతన సంఘం ప్ర క్రియను వేగవంతం చేయాలని కోరారు. కనీస వేతనాన్ని రూ.55 వేలుగా నిర్ణయించి, అదే నిష్పత్తిలో అన్ని క్యాడర్లకు వర్తింపజేయాలని, 50 శాతం దాటిన కరువు భత్యాన్ని మూల వేతనంలో కలపాలని, నిలిపివేసిన 18 నెలల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాందచేశారు. ప్రైవేటీకరణ, సరళీక రణ పేరుతో రైల్వేలను ప్రైవేటుపరం చేయవద్దని హెచ్చరించారు. భద్రతా విభాగాలలో ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం జరిగే జనరల్ కౌన్సిల్ సమావేశాలో విస్తత గా చర్చించి రైల్వే యంత్రాంగానికి తీర్మానం పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంప్లా యినసంఘ్ జోనల్ అధ్యక్షుడు ఎం ప్రభాకర్ ఆంద్రూస్, జాయింట్ జనరల్ సెక్రెటరీ భరణీ భానుప్రసాద్, ఏ.జీ.ఎస్ లు షేక్ రవూఫ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరావు ఆకుల రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

42 ప్లాట్ల బాధితులకు అండగా ఉంటాం : ఆప్

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : జోజి నగర్ ఇల్లు కూల్చివేత బాధితలకు అండగా నిలుస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి నేతి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం భవానిపురం జోజి నగర్ కరెంట్ ఆఫీస్ రోడ్డులోని 42 ప్లాట్ల బాధితులను ఆప్ బృంద సభ్యులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరావు మాట్లాడుతూ బాధితులకు



న్యాయం జరగాలంటే ఓ కమిటీగా ఏర్పడి పోరాటం సాగించాలన్నారు. ఈ న్యాయ పోరాటంలో బాధితులకు ఆప్ అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. వైసిపి, కూటమి ప్రభుత్వాల వల్ల బాధితులకు న్యాయం జరగదన్నారు. ఆప్, వామపక్షాలు, జై భీమ్ పార్టీతో పాటు కలిసి నడవాలని బాధితులతో తెలిపారు. 42 ప్లాట్ల (2.17 ఎకరాల) స్థల యజమాని అబ్దుల్ మజీద్‌తో పాటు స్థల రిజిస్ట్రేషన్, భవన నిర్మాణం, వివిధ పన్నులు వసూలు చేసిన అన్ని ప్రభుత్వ వ్యవస్థలపై కేసులు పెట్టాలని బాధితులకు సూచించారు. పోలీసులు స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు లొంగి ఇల్లు కూల్చివేతకు సహకరించారన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే 42 మంది జేఏసీగా ఏర్పడి గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో ఆప్ నేతలు పర్వతనేని హరిక ష?, సాయి విశ్వనాథ్, దారివేముల రూబెన్ ఉన్నారు.

విద్య ద్వారానే అన్ని రంగాల్లో రాణింపు

విజయవాడ : విద్యను అభ్యసించడం ద్వారానే సమాజంలో అన్ని రంగాల్లో రాణించవచ్చని ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి అన్నారు. విస్సన్నపేట మండల పరిధిలోని



కొండపూర్వ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్ ఆయన ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా చదువును కొనసాగించాలని, తద్వారానే సామాజిక హోదా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బీసిహెచ్‌వి సూర్యనారాయణ మాట్లాడుతూ నిపుణులైన ఉపాధ్యాయులతో రూపొందించబడిన స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకొని పదో తరగతిలో నూరు శాతం సాధించాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మిన కోటేశ్వరరావు యుటిఎఫ్ విసన్నపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ మురళి, సిహెచ్ చంటిబాబు, యూట్యూబ్ నాయకులు కే.రంగా. వి వెంకటేశ్వరరావు. డి ప్రకాష్. డి రాంబాబు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

దస్త్రాల పరిష్కారంలో కృష్ణాజిల్లా ముందంజ

- కలెక్టర్ డికె బాలాజీని అభినందించిన ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గంటల వ్యవధిలో ఈ-కార్యాలయ దస్త్రాలను పరిష్కరించడంలో నలుగురు జిల్లా కలెక్టర్లు నిలవగా అందులో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అగ్రస్థానంలో నిలిచినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, మంత్రివర్గ సహచరులు, వివిధ ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, అధిపతులతో కలిసి మొదటిరోజు జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి గత మూడు నెలలుగా జిల్లాల వారీగా ఈకార్యాలయ దస్త్రాల పరిష్కారం పై సమీక్షిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ తో పాటు నలుగురు జిల్లా కలెక్టర్లు ఒకరోజు కంటే తక్కువగాకొన్ని గంటల్లోనే ఈ-కార్యాలయ దస్త్రాలను పరిష్కరించారన్నారు. అందులో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రథమ స్థానంలో నిలిచారని అభినందించారు. క్షేత్ర స్థాయి కార్యాలయాల్లో



సిబ్బంది ముఖ్యంగా వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు రీ సర్వే కార్యక్రమంలో భాగంగా ఉదయమే గ్రౌండ్ ట్రూతింగ్ కోసం వెళ్తుంటారని వారికి విధుల హాజరు నుండి మినహాయింపు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ కార్యాలయానికి రాని వారి పట్ల కలెక్టర్లు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, క్షేత్ర పర్యటనకు వెళ్లిన వారికి మినహాయింపు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శికి సూచించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

నూతన సాంకేతిక నమూనాల ప్రదర్శనలు

ప్రజాశక్తి-మొవ్వ : ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు తమ గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనను స్థానిక మొవ్వ మండలంలోని జానకి రామయ్య కళ్యాణ మండప ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పామర్రు నియోజకవర్గ శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా ముఖ్య అతిథిగా విచ్చేసి వ్యవసాయ విద్యార్థినులు ప్రదర్శన చేసిన వ్యవసాయ, అనుబంధ రంగాలలో నూతన సాంకేతికను తెలిపేలా తయారు చేసిన ప్రతిరూప నమూనాలను వీక్షించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు విద్య ప్రణాళిక గురించి మూడు నెలలుగా వివిధ గ్రామాలలో ఉంటూ చేసిన కార్యక్రమాలను గురించి కేవికే సమన్వయ కర్త డా. డి. సుధారాణి వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రతినిధిగా ప్రసన్న కుమారి, ఆర్ఎడబ్ల్యూ ఈ పి ఇంచార్జి సువర్ణలత, మొవ్వ గ్రామ సర్పంచ్ పూర్ణ చంద్ర రావు, మొవ్వ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామయ్య, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు, గొర్రెపాటి రామకృష్ణ, మొవ్వ మండల అభివద్ధి అధికారిణి సుహాసిని, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థి దశలోనే ప్రణాళికలు రూపొందించుకోవాలి

ప్రజాశక్తి-పామర్రు : విద్యార్థి దశలోనే ప్రతిఒక్కరూ ప్రణాళికను రూపొందించుకుని క్రమశిక్షణ తో నడిస్తే అనుకొన్న విజయం తథ్యమని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య డా.మండవ బసవేశ్వరరావు వెల్లడించారు. మానవత సేవ సంస్థ ఆధ్వర్యంలో పామర్రు కంచర్ల రామారావు జడ్పి హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాశ శిక్షణ తరగతుల శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవగాహనతో విద్యానభ్యశించాలని అప్పుడు యాం త్రికంగా ఆ సబ్జెక్ట్ అర్థం కాగలదని వివరించారు. శ్రద్ధ, పట్టుదల, క్రమశిక్షణ, అవగాహన విద్యార్థికి అవసర మన్నారు. మానవత పామర్రు శాఖ అధ్యక్షులు ఎన్. త్రివిక్రమరావు అధ్యక్షతన జరిగిన ఈ సభ లో మానవత రీజియన్ చైర్మన్ పి. ఎం. ఎస్. ప్రసాద్,ప్రోగ్రామ్ కోఆర్డ్ నేటర్ వై. ఎస్.ఎస్.



సమావేశంలో మాట్లాడుతున్న బసవేశ్వరరావు

ప్రసాద్, కేరియర్ గైడెన్స్ కన్వీనర్ పామర్తి వెంకట నారాయణ, డైరెక్టర్లు కేశన రవీంద్ర, బొందు సుధాకర్, ఇంచార్జ్ హెచ్ ఎం సామ్రాజ్యం తదిత రులు మాట్లాడారు. అనంతరం 8, 9,10తరగతుల్లో విద్యా ప్రతిభవంతులకు ధ్రువపత్రాలు,జ్ఞాపికలు, నగదు బహుమతులు మానవత వారు ప్రత్యేకంగా అందచేశారు.




విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని కృష్ణా విశ్వవి ద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలోఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొడాలి ఆకాష్ బ్రైన్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి ఆపరేషన్ నిమిత్తం కావలసిన సొమ్ములో కొంత సొమ్ము సాయం అందించేందుకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు వచ్చింది. ఉపకులపతికి సంస్థ అధ్యక్షుడు జి కిషోర్,కార్యదర్శి డా హుసేన్‌బేగ్, ఉపాధ్యక్షుడు బొమ్మిడి స్వామి, జిల్లా కో కన్వీనర్ ముదిగొండ శాస్త్రి లు రూ 25 వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి రాంజీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఒక లక్షా యాభై వేలు పోగు చేసి ఇచ్చారన్నారు. తోటి స్నేహితుని ఆదుకోవడంలో విద్యార్థులు చూపిన చొరవ స్నేహానికి దర్పణంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఐసిడిఎస్ గుడివాడ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాళ్లకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు గుడివాడ ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి తెలిపారు. గుడ్లవల్లేరు మండలంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో గురువారం ఉదయం 9 గంటలకు ఆర్డీవో కార్యాలయం నందు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

గురుమూర్తికి అభినందనలు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడు వీరంకి గురుమూర్తికి మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు అభినందనలు తెలిపారు. వీరంకి గురుమూర్తి పనితీరును గమనించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకు సముచిత స్థానం కల్పించారని మోహన్ పేర్కొన్నారు.



సిఐటియు మహాసభ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-గన్నవరం : జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు మండలం నుండి అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని గన్నవరం సిఐటియు మండల కన్వీనర్ బెజవాడ తాతబ్బాయి పిలుపునిచ్చారు. గన్నవరం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సిఐటియు ఆల్ ఇండియా మహాసభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, పంచాయతీ వర్కర్ యూనియన్ నాయకులు గణేష్, నాగమణి ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు భవాని, వీరమ్మ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి మరియదాసు, పఠాన్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ సర్వేపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఫ్యామిలీ సర్వే ద్వారా సేకరించే కుటుంబాల సమాచారం భవిష్యత్తులో పాలనను సులభతరం చేస్తుందని మండల పరిషత్ అభివద్ధి అధికారి జీవిస్వి శేషగిరిరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే కార్యక్రమంపై మండలంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రారంభిస్తూ ఈ సర్వే ద్వారా రూపొందించిన దస్త్రాలు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు అమల్లో కీలకంగా కానున్నాయని అన్నారు. ఈ సేకరణ అనంతరం ప్రభుత్వం ఫ్యామిలీ బెనిఫిట్ కార్డును ప్రతి



కుటుంబానికి అందిస్తుందని తద్వారా సంక్షేమ కార్యక్రమాల అమలు సులభతరం కానున్నదని తెలిపారు. అనంతరం ఉయ్యూరు ప్రధాన వీధిలో సచివాలయ సిబ్బందితో ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు పై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి ఎపిఎస్ కోటేశ్వరావు పలు గ్రామాల కార్యదర్శులు వివిధ శాఖల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివనాగమల్లేశ్వరరావుకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-మొవ్వ : గుంటూరు జిల్లాలో జరిగిన 45వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ శివనాగమల్లేశ్వరరావు ఎస్ఏ (హిందీ) రిలే 4x100 లో బంగారు పతకం,200 మీటర్స్ రన్నింగ్ లో రజత పతకం, 100 మీటర్స్ మరియు 400 మీటర్స్ రన్నింగ్ లలో కాంస్య పతకాలు సాధించారు. నాగమల్లేశ్వరరావుకు ఆ పాఠశాల ఎస్ఎంసి చైర్ పర్సన్ ఎమ్ రజని ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు పామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాఠశాలలో నాగమల్లేశ్వరావును సత్కరించి అభినందనలు తెలిపారు.



నూతన కమిటీకి అభినందనలు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : కృష్ణాజిల్లా మచిలీపట్నంలో రాధా రంగా మిత్రమండలి కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల రాధా రంగా మిత్రమండలి కన్వీనర్‌గా కుంచే దత్తాత్రేయులు (దత్తు), విశాఖ పట్నం జిల్లా రాధ రంగా మిత్రమండలి మహిళా అధ్యక్షురాలుగా కొలగాని మహాలక్ష్మి నియమితులయ్యారు. బుధవారం మచిలీపట్నం రాధా రంగా మిత్ర మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర, తెలంగాణ అధ్యక్షులు, జనసేన నాయకులు బుల్లెట్ ధర్మారావు పాల్గొని నియామక పత్రాలను అందజేశారు. ముందుగా మచిలీ పట్నంలోని రేవతి సెంట ర్లో వంగవీటి మోహన రంగా గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ ధర్మారావు, మట్టా వెంకటేశ్వరరావు, ధూళిపాల శ్రీరామ చంద్రమూర్తి, లంకె శాంతిరాజ్, వల్లభ చంద్రశేఖర్, పిన్ని రమేష్, విన్నకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీని అభినందిస్తున్న దృశ్యం

గ్రామాల్లో గొబ్బిళ్ళ సందడి

ప్రజాశక్తి-మొవ్వ: సంక్రాంతి నెల బుధవారం నుంచి ప్రారంభం కావడంతో గ్రామాలలో ఆడపిల్లలు తమ ఇంటి ముందు రకరకాల ముగ్గులు వేసుకోవడంలో, గొబ్బె మ్మలను



పెట్టుకోవడంలో సందడిగా మారారు. కంప్యూటర్ యుగం, సెల్ ఫోనుల మోజు కొనసాగుతున్నా కూడా తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాన్ని పలువురు ఆడపిల్లలు సాంప్రదాయ సిద్ధంగాపాటిస్తున్నారు. దీనిలో భాగంగానే వచ్చేనెల14వ తారీకు వరకు ఆకర్షణీయమైన ముగ్గులు, ఆవు పేడతో తయారైన గొబ్బెమ్మలను ఇంటి లోగిలి ముందు పెట్టుకోవడంతో వీధులు ఆకర్షణీయంగా మారాయి.

పిఎసిఎస్ సిఇఒ సస్పెన్షన్

ప్రజాశక్తి మైలవరం : మండలంలోని తోలుకోడు వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్) సీఈవోను సస్పెండ్ చేస్తూ కేడీసీసీ సీఈవో శ్యామ్ మనోహర్ ఉత్తర్వులు అందాయి. సీఈవో జి.చిన్న వెంకటేశ్వరరావుపై విధుల నిర్వహణలో అలసత్వం, నిధుల దుర్వినియోగానికి పాల్పడటం, రైతులకు సంబంధించి రుణ లావాదేవీల అక్రమాలకు పాల్పడటంతో రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు చిన్న వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు. బుధవారం పిఎసిఎస్ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పాఠశాల దశలోనే ప్రయోగాత్మక ప్రాజెక్టులు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులు దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకు రాగలరని పెనుగంచి



ప్రోలు మండల విద్యాశాఖ అధికారి డి రవీందర్ అన్నారు. బుధవారం పెనుగంచిప్రోలు కె.వి.ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఎంఈఓ రవీందర్, హెచ్‌ఎం కే.జలజ విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నారు. శుక్రవారం విజయవాడలో జరగబోయే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు మండలం నుండి ప్రాజెక్టులు వెళతాయని ఎంఈఓ రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, నాగరాజు, స్వర్ణలత, అనూష, పాల్గొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న డిసిపి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని ఎన్టీఆర్ జిల్లా రూరల్ డిసిపి బి.లక్ష్మీ నారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు



నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం నిత్య కళ్యాణ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం, అమ్మవారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదం అందజేశారు. అమ్మవారి ప్రధాన ఆలయ అర్చకుడు ఎం గోపి బాబు ఆలయ ఏఈ రాజు ఐదో తారీకు నుండి జరుగు రంగుల మహోత్సవం, గ్రామోత్సవం గురించి వివరించారు. వీరి వెంట జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎంఎస్కే అర్జున్, పాల్గొన్నారు

ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-వత్సవాయి : టెట్ నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు అజ్మీర్ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీచర్ల సమస్యలపై ఈ నెల 18న యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు విద్యాహక్కు సట్ట సవరణ, ఎన్‌సి టీవీ నిబంధనలకు సవరణ చేయడానికి నిబంధనలకు సవరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో సిపి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు, ట్రాఫిక్, డీసి పి, షరీన్ బేగం, ఐపీఎస్ సూచనల మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం రింగ్



సర్కిల్లో, ఇబ్రహీంపట్నం, సర్కిల్ ఇన్స్పెక్టర్, ఏ చంద్రశేఖర్, ప్రమేయంతో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, కష్ణ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించండి మీ కుటుంబాన్ని క్షేమంగా చేరుకోండి అనే సూచనలతో ద్విచక్ర వాహనదారులకు విద్యార్థుల ద్వారా ట్రాఫిక్ సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనదారులకు దిశా నిర్దేశనం చేశారు. ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు ద్విచక్ర వాహనదారులకు వివరించారు.

బూడిద కాలుష్యం కట్టడికి చర్యలు తీసుకోండి

- ప్రజా దర్బార్‌లో సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపిడివో కార్యాలయంలో బుధవారం మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో పలు ప్రజా సమస్యలపై సిపిఎం ఇబ్రహీంపట్నం మండల కమిటీ తరఫున వినతిపత్రం అందజేశారు. ప్రధాన ప్రజా సమస్యలైన తాగునీరు, ప్రతి ఇంటి కుళాయి, విటిపియస్ బూడిద కాలుష్యం, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, ఇళ్ల పట్టాలు, లోన్స్ సదుపాయం, పరిశ్రమలో ప్రమాదాల నివారణకు చర్యలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ పాలిటెక్నిక్, ఐటిఐ కాలేజ్‌ల ఏర్పాటు, కాలనీలో మౌలిక సదుపాయాలు, ఫెర్రీ సంగమం రిటైనింగ్ వాల్ , డ్రైనేజీ, తోపుడు బండ్లు వర్కర్స్ కీ ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు, మున్సిపల్ వర్కర్స్ రీప్లేస్మెంట్ అవకాశం తదితర సమస్యల గురించి ప్రస్తావించినట్లు సిపిఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ తెలిపారు. ఇబ్రహీంపట్నంలో వీటీపీఎస్ బూడిద ప్రమాదం తీవ్రంగా పొంచి ఉన్నదని, నివారణ చర్యలు తీసుకోవడంలో డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, నిరంతరం ప్రమాదాలు జరగటం వల్ల ఉద్యోగులు కార్మి కులు తీవ్రంగా ఇబ్బందులు




పడుతున్నారని, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సిఎస్‌ఆర్ నిధులు కొండపల్లి మున్సిపాలిటీ ఇబ్రహీంపట్నం మండలం ప్రజలకు ఉపయోగించాలని కోరారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో రిటైర్ అయిన, చనిపోయిన వర్కర్ స్థానంలో వారి పిల్లలకు పని అవకాశం రీప్లేస్మెంట్ కల్పించాలని, కరోనా సమయంలో పనిచేసిన వారికి కూడా పని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండపల్లి టౌన్ కమిటీ సభ్యులు ఈ కొండలరావు, కే బేబీ సరోజినీ పార్టీ సభ్యులు జి రమణమ్మ ఎస్ పాపయ్య, యు నవీన్ ప్రజా సంఘాల నాయకులు కృష్ణ, నాని, అంజలి పాల్గొన్నారు.

రైతు సదస్సు

ప్రజాశక్తి-చందర్లపాడు : మండలంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థులు గ్రామీణ అవగహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అలివేలమ్మ కల్యాణ మండపంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల బాపట్ల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసన్నారాణి, కోట వీరబాబు, నాగార్జున సాగర్ చైర్మన్ డాక్టర్.ఎమ్. రవి కిషోర్, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నేత్రదానం

ప్రజాశక్తి-గంపలగూడెం: టౌన్‌కు చెందిన బొడ్డు రంగారావు (71) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు.



రంగారావు నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులను స్థానిక లైన్స్ క్లబ్ సభ్యులు గోగిరెడ్డి కష్ణారెడ్డి ఒప్పించారు. ఈ మేరకు విజయవాడ ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు.

ముగిసిన ఆలయ పాలకవర్గం పదవీకాలం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి ఆలయ పాలకవర్గ పదవి కాలం రెండు రోజుల క్రితమే ముగిసింది. 2023 డిసెంబర్ 17న పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. గత ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బడుగు,



బలహీన వర్గాలకు కల్పించడంతోపాటు ఆలయ పాలకవర్గాల్లో నాయి బ్రాహ్మణుడికి అవకాశం దక్కింది. దీంతో శ్రీ తిరుపతమ్మ ఆలయ చైర్మన్ గా బీసీ వర్గానికి చెందిన జంగాల శ్రీనివాసరావును వరించింది. ఎవరి ప్రయత్నాలు వారివే : ఆలయ పాలకవర్గ పదవీకాలం పూర్తవటంతో కూటమి నాయకుల్లో చైర్మన్ పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు ప్రారంభించారు. గతంలో పాలకవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి నేరుగా దేవస్థాన పాలకవర్గ బోర్డు నియామకం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

అంగన్వాడీ టీచర్లకు ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ పట్టణం కాకాని నగర్‌లో బుధవారం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్) శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు 5జి స్మార్ట్ ఫోన్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ స్మార్ట్ ఫోన్లను అందిస్తుందని తెలిపారు. బాలల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక ద ష్టి సారిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిబ సిడిపిఓ లక్ష్మీ భార్గవి, ఐసిడిఎస్ శాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ అందజేత

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి పలువురు దాతలు సుమారు పది లక్షల రూపాయల విలువైన కంప్యూటర్ పరికరాలను అందజేశారు. బుధవారం దుర్గమ్మ దర్శనానికి వచ్చే యాత్రికులకు ఇకపై అన్ని



సేవలు ఆన్లైన్లో సులభతరంగా అందుబాటులోకి రానున్నాయని ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈఓ సీనా నాయక్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆన్లైన్ సేవల నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లను ఆలయానికి లక్ష్మీనరసయ్య చౌదరి కుటుంబ సభ్యులు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఈవో శీనా నాయక్, 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు పీవీ చిన్న సుబ్బయ్య తోపాటు దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం పొందడం ప్రతి పౌరుడి హక్కు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- నందిగామ : సమాచార హక్కు అనేది సామాన్యుడి చేతిలో వజ్రాయుధమని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, నందిగామ మున్సిపల్ కమిషనర్ లోవరాజు పేర్కొన్నారు. నందిగామలోని బాబు జగజీవన్ రామ్ హాల్లో సామాజిక కార్యకర్త ఫోరం ఫర్ డెమోక్రసీ ఫౌండర్ పౌర సమాజ ఐక్య సేవా సంఘం నాయకులు కూరగంటి హనుమంతరావు ఆధ్వర్యంలో



సమాచార హక్కు చట్టం 2005పై బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ లోవరాజు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాలన పారదర్శకంగా జవాబుదారీ తనంగా రూపొందించడానికి, ప్రజలకు ప్రభుత్వ పనితీరుపై అవగాహన కల్పించేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ ఫణి శ్రీనివాసరావు, శ్రీవాణి, డాక్టర్ అంజని, కొత్తపల్లి సుందర్, హేమలత, డాక్టర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: నవ జీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని ఎస్ కె వి ఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై బుధవారం అవగాహన సదస్సును స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్ జాకబ్ రాజు మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్ కె నజ్మ మాట్లాడుతూ నూజివీడు మండలం పోలసానపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్నిగానీ, ఫోన్ నంబర్ 9490492020ను గానీ సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్లు సిహెచ్‌సాయిబాబు, పి.విజయ్ కుమార్, పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

ఈ నెల 21న తిరువూరులో జరగబోయే యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా 4వ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారంకరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. భవాని, మండల ప్రధాన కార్యదర్శి డి.ప్రకాష్, సహాధ్యక్షులు డి.సర్దార్ నాయక్, కార్యదర్శులు రాంబాబు, మల్లవల్లి సుబ్బారావు, పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటు : సౌమ్య

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణం కాకాని నగర్‌లో బుధవారం కేశినేని ఫౌండేషన్, ఎన్‌ఐఆర్డి (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) సంయుక్త ఆధ్వర్యంలో బ్రిక్స్ తయారీ విధానంపై నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి వెళ్లే మహిళల బస్సును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ



శిక్షణ ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐఆర్డి పిఆర్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఎంతో దోహదపడతాయన్నారు. కేశినేని ఫౌండేషన్ సహకారంతో మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తుండటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష కుమారి, నందిగామ టౌన్ పార్టీ ప్రెసిడెంట్ ఏచూరి రాము , ఎన్టీఆర్ జిల్లా రూరల్ మహిళ సమైక్య అధ్యక్షురాలు కందుల కల్పన, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు : రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం యనమల కుదురు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు టీ షర్టులు, యనమలకుదురు లాకులు సెంటర్లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా శివరామ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక ప్రజల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ బాలాజీ, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పితా గోపీచంద్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, కంకిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ భూక్యా బిచ్చాలి రాజా పాల్గొన్నారు



కెకెఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడివాడ : ఇటీవల నిర్వహించిన హెూమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ నిర్వహించిన రీజనల్ మేథ్‌మెటికల్ ఒలింపియాడ్ పోటి పరీక్షలో 13 మంది డా॥కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచినట్లు స్కూల్ ప్రిన్సిపల్ రామిరెడ్డి, ఎం.సత్యారామ్, పి.లక్ష్మీప్రసాద్, కె.జ్యోతి, ప్రశాంతిలు తెలిపారు. బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులోని గౌతమ్ స్కూల్‌లో విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా॥కె.కె .ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు ఈ పోటీ పరీక్షలలో రెండవ లెవల్ ప్రతిభ కనబరిచి 3వ లెవల్‌కు అర్హత సాధించారన్నారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఉయ్యూరు : రైతు సంక్షేమం, అభివద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ అధ్యక్షతన బుధవారం ముదునూరులో జరిగిన పీఏసీఎస్ నూతన పాలక వర్గం ప్రమాణీస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొని చైర్పర్సన్ పాలడుగు సత్యనారాయణ, పర్సన్స్ చావలి పేరయ్య, చిమటా సాంబశివరావుతో ప్రమాణీ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు ఏవిధమైన ఇబ్బంది పడకు ండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుందని, 24 గంటల్లోనే డబ్బువారి బ్యాంకు ఖా తాలో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ముదునూరు- జబర్లపూడి రోడ్డుకు రూ.17 లక్షలు, దూసరపాలెంకు రూ.90 లక్షలు నిధులు మంజూరు కాగా త్వరలో పనులు ప్రారంభిస్తారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుటుంబరావు, కార్యదర్శి శరత్, పార్టీ నాయకులు శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్ వెంకటనాగలక్ష్మి పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఉపాధి హామీ పేరు మార్పు విరమించుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-గన్నవరం : 2005లో ప్రవేశా ఎట్టిన మహా త్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుమార్పు, మహాత్మా గాంధీ ఫోటోని తొలగించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ “ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిధులు కోత పెడుతూ చట్టాన్ని రద్దు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఈ పథకంలో దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది ప్రజలు సంవత్సరానికి వంద రోజులు పని చేస్తూ జీవనం సాగిస్తున్నారని, దీన్ని సహించలేని బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చి, మహాత్మా గాంధీ ఫోటోని తొలగించి, హామీని వేరుచేసి పీవీ రాంజీ పేరిట తీసుకురావడం కోసం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఎన్డీఏ లో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంట్లో ప్రవేశ పెట్టబోయే ఈ బిల్లుని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొండా వీరస్వామి, సిఐటియు నాయకులు జోషి, బెజవాడ తాతబ్బాయి, పఠాన్ సర్దార్, మిరప నాగేశ్వరావు, బాబావలీ, జి వీర్రాజు, కె విజయారావు పాల్గొన్నారు.

రబీలో యూరియా పంపిణీకి ప్రణాళిక

- జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కృష్ణాజిల్లాలో రబీసీజన్‌కు సరిపడా యూరియా పంపిణీకి ప్రణాళిక సిద్ధమైనట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి బుధవారం తెలిపారు. జిల్లాలో రబీకి 1,44,547హెక్టారుల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం 899 హెక్టారుల్లో వరి, 725 హెక్టారుల్లో మొక్కజొన్న సాగు చేశారన్నారు. గత అక్టోబర్ ఒకటో తేదీ నుంచి నేటి వరకు కృష్ణాజిల్లాలో మొత్తం 6,447మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగియన్నారు. నేటికి 6,104మెట్రిక్ టన్నుల యూరియా కో ఆపరేటివ్ సొసైటీలలో, ఆర్ఎస్‌కేల్లో, మార్క్ ఫెడ్ గోదాములలో, రిటైల్/హెూల్‌సేల్, కంపెనీ గోదాములలో రైతాంగానికి అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కష్ణాజిల్లాలో ఇప్పటి వరకు ఎటువంటి ఎరువుల కొరత లేదన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని శేరికల్వపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను బుధవారం పంపిణీ చేశారు. ఆ పాఠశాలలో పనిచేసిన ఎన్ లక్ష్మీకుమారి ఈ సంవత్సరం అక్టోబర్ నెలలో పదవీ విరమణ మణ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయడానికిగాను ఆమె ఈ ప్లేట్లు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు పి శైలజ తెలిపారు. దాతల సహకారంతో పాఠశాల మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, పూర్ణిమ పాల్గొన్నారు.



యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-గన్నవరం : యువత మాదకద్రవ్యాల వంటి వ్యసనాలు, సాంఘిక దురాచారాలకు దూరంగా ఉండి, నైపుణ్యాభివృద్ధి ద్వారా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ విజయవాడ ఛాప్టర్ ఆత్కూరులో వివిధ వృత్తిశిక్షణ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులతో బుధవారం వెంకయ్యనాయుడు మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్లు అందజేశారు. సమాజానికి మాదకద్రవ్యాలు పెద్ద సవా లుగా మారాయని ఆందోళన వ్యక్తం చేసిన వెంకయ్యనాయుడు, యువత వ్యసనాలకు బానిసకాకుండా శారీరక, మానసిక దఢత్వం కోసం యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ సీఈవో శరత్ బాబు, విజయవాడ ఛాప్టర్ కార్యదర్శి చుక్కపల్లి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరదేశీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఎపిపిల నియామకం



ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జిల్లా కోర్టు సముదాయంలో న్యాయ సేవలు పెంపొందించేందుకు జిల్లా న్యాయశాఖ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించింది. పదో అదనపు జిల్లా కోర్టుతో పాటు ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టుకు ఏపీపీగా భోగి రెడ్డి వెంకన్న బాబు నియమితులయ్యారు. మొదటి అదనపు జిల్లా కోర్టుకు తిరుమాని సత్యనారాయణ ఏపీపీగా నియమితులయ్యారు. మూడేళ్లపాటు వీరు ఈ పదవిలో కొనసాగుతారని న్యాయశాఖ వర్గాలు తెలిపాయి.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం నెప్పల్లి గ్రామంలో జాతీయ ఆహార భద్రత, పోషకాల మిషన్‌లో భాగంగా 25 మంది రైతులకు 50 శాతం సబ్సిడీ మీద వ్యవసాయ ఉత్పాదకాలు బుధవారం అందించారు. నెప్పల్లి సొసైటీ చైర్మన్ చలసాని జోగేంద్ర, మండల వ్యవసాయ అధికారి ఉషారాణి,వ్యవసాయ సహాయకులు నాగరాజు మరియు రైతులు పాల్గొన్నారు.

డోకిపర్రులో పల్లకీ ఉత్సవం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజలు భోగి రోజున గోదా కల్యాణంతో ముగియనున్నాయి. సూర్యుడు ధనుర్మాసంలోకి ప్రవేశించారని వేద పండితులు తెలిపారు. ఈ సందర్భంగా మహాక్షేత్రంలోని ఆలయంలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణ నడుమ వైభవంగా వేద పండితులు విశేష ధనుర్మాస పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవికి పల్లకీ ఉత్సవం కూడా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. భోగి పండుగ వరకు ప్రతిరోజూ ఉదయం నాలుగున్నర గంటలకు ప్రత్యేక పూజలు, సాయంత్రం గోదా అమ్మ వారికి పల్లకీ సేవలు, వేదాంత రాధాకృష్ణమాచార్యులచే ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయ ప్రాంగణమంతా రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్ల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజక వర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి పెన్షన్ సాధకుడు డిఎస్ న కారా చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ పెన్షనర్ల ఆకాంక్షలు కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. పెన్షనర్ల అసోసియేషన్ పెద్దలు పెన్షనర్లకు అందిస్తున్న సేవలు అభినందనీయమని, డిజిటల్ మోసాలపై పెన్షనర్లకు పోలీసు శాఖ ద్వారా అవగాహన కలిగించటం మంచి శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా అసోసి యేషన్ అధ్యక్షులు ఎం. రామకష్ణ, కార్యదర్శి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. తాసిల్దార్ కె. కే నాగమల్లేశ్వరరావు, సీఐ యువకుమార్, స్టేట్ బ్యాంక్ మేనేజర్ నరేష్ చంద్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : ఇన్సూరెన్స్ సంస్థలలో పదవి విరమణ చేసిన ఉద్యోగుల న్యాయ సమ్మతమైన డిమాండ్ల పరిష్కార సాధనకు పోరాడుతామని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బీహెచ్ వివిఎల్ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం పెన్షనర్ల ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా మచిలీపట్నం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెన్షన్ అప్డేషన్ ఇవ్వడంతో పాటు ఫ్యామిలీ పెన్షనర్లు అందరికీ 30 శాతం మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. పెన్షనర్ లందరికీ ప్రతి నెల క్యాష్ మెడికల్ బెనిఫిట్ చెల్లించాలన్నారు. పెన్షన్ మీద వచ్చే సొమ్ముకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలన్నారు. 1986 ముందు పదవి విరమణ చేసిన వారికి ఎక్స్గ్రేషియా గణనీయంగా పెంచాలన్నారు. పెన్షనల్లో న్యాయబద్ధమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీవిత బీమా ఉద్యోగుల సంఘం మచిలీపట్నం డివిజన్ నాయకులు జి కిషోర్ కుమార్, డి వాసు తదితరులు విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి-బంటుమిల్లి : ఆల్ ఇండియా పెన్షనర్స్ డే సందర్భంగా బంటుమిల్లి రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సంఘ అధ్యక్షులు చండిక గంగజాలరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సబ్ ట్రెజరీ అధికారి కాగిత గోపికృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ పరసా పద్మనాభరావు, దైవ కుమార్, గల్లగుంచు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు లో శ్రీ కన్యకా పరమేశ్వరి సత్రంలో పెన్షనర్స్ డే సందర్భంగా పెన్షనర్స్ పిత డిఎస్ నకార చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెన్షనర్స్ కంకిపాడు మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎం నాగేశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ కంకిపాడు మండల శాఖ అధ్యక్షులు ఆర్ సుబ్బారావు, కే ఆనందరావు,డి జనార్దన్ రావు,జి సత్యనారాయణ,పి ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో...



కంకిపాడులో..

అమరావతి సీజన్ -10 బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అమరావతి అభివృద్ధితో పోటీపడుతూ.... తేజస్ ఎలైట్ ఈవెంట్స్ ఆర్గనైజ్ చేస్తున్న శ్రీమతి అమరావతి సీజన్ -10 బ్రోచర్‌ను డాక్టర్ కళ్యాణి, వసుధ ఇన్ఫ్రా అధినేత్రి శ్రీ లక్ష్మీ, ఫోనిక్స్ గ్రీన్ వ్యాలీ అధినేత నాగభాస్కర్ చేతుల మీదుగా బెల్లీ అండ్ బ్లూమ్ స్టూడియో, మహానాడు రోడ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తేజస్ ఎలైట్ ఈవెంట్స్ సిఇఒ ప్రదీప్ చౌదరి మాట్లాడుతూ గత తొమ్మిది సీజన్లు దిగ్విజయంగా పూర్తి చేసుకొని 10వ సీజన్లోకి అడుగుపెట్టడం ఆనందదాయకంగా ఉందని తెలిపారు. భారత దేశ సాంస్కృతి సాంప్రదాయాల మేళవింపుతో చీరకు ఉన్న సాంప్రదాయాన్ని వెలిగి తీసేందుకు ఈ శ్రీమతి అమరావతి అనేది ఒక మంచి వేదిక అవుతుందని తెలియజేశారు. ఈ నెల 21నఉదయం 9 గంటల నుండి శ్రీమతి అమరావతి సీజన్-10 ఆడిషన్స్ను హెూటల్ నోవాటెల్‌లో ఉంటుందన్నారు. ఆసక్తి గల 35 సంవత్సరాలలోపు మహిళలు ఫోన్ నెంబర్లు 9640893406, 7396373535 సంప్రదించాలని కోరారు.



కృష్ణా వర్సిటీ క్రికెట్ ఛాంప్ పిబి సిద్ధార్థ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కృష్ణా విశ్వవిద్యాలయం క్రికెట్ పురుషుల పోటీలలో విజయవాడ పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఓవరాల్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రికెట్ టీం నలంద డిగ్రీ కళాశాలపై ఆరు వికెట్ల తేడాతో విజయకేతనం ఎగరేసినట్లు ప్రిన్సిపాల్ డా.మేకా రమేష్ తెలిపారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నలంద కళాశాల జట్టు 19 ఓవర్లలో ఆలౌట్ కాగా పి.బి. సిద్ధార్థ కళాశాల జట్టు నిర్దేశిత 98 పరుగుల లక్ష్యాన్ని నాలుగు వికెట్లు కోల్పోయి 14 ఓవర్లలో సాధించింది. వి విశాల్ 38 పరుగులతో అత్యధిక స్కోరు సాధించిన బ్యాట్స్మెన్‌గా, నాలుగు వికెట్లు తీసిన ఏకాంతం ఎకాథన్ సింగ్ బెస్ట్ బౌలర్‌గా నిలిచారు. వర్సిటీ పరిధిలో గతంలోని ఈస్ట్ , వెస్ట్ జోన్లను కలిపి సెంట్రల్ జోనుగా చేసిన నేపథ్యంలో మొదటిసారి జరిగిన ఈ పోటీల్లో పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రికెట్ బృందం చాంపియన్షిప్ కైవసం చేసుకోవడం పట్ల కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ నిమగడ్డ లలితప్రసాద్, కళాశాల క్రీడా విభాగాధిపతి డాక్టర్ టీవీబీ కృష్ణారెడ్డి క్రీడాకారులను అభినందించారు.



గోకాఫ్ నూతన ప్యాక్ విడుదల

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నాలుగు దశాబ్ధాలకుపైగా ఘనచరిత్ర కలిగిన, ఆరోగ్య పరిరక్షణ రంగంలో ప్రసిద్ధి గాంచిన కంపెనీచే తయారు చేయబడిన ఫిజికెమ్ వారి గోకాఫ్ ఇప్పుడు మార్కెట్‌లో 120 ఎం.ఎల్. ప్యాక్‌తో అందు బాటులోకి వచ్చిందని ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీసీ కేశవరావ్ తెలిపారు. గోకాఫ్ 120 ఎం.ఎల్. బాటిల్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మహాత్మాగాంధీ రోడ్డు టిక్కిల్ రోడ్డులలోని హోటల్ మానర్ ఫుడ్ ప్లాజాలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ కేశవరావ్ మాట్లాడుతూ గోకాఫ్ గత 20 ఏళ్ళుగా దక్షిణ భారతదేశం వ్యాప్తంగా మార్కెటింగ్ చేయబడుతుందన్నారు. ప్రస్తుతం 120 ఎం.ఎల్. ప్యాక్‌తో ఆవిష్కరించిన బాటిల్‌లో 20 ఎం.ఎల్. కన్స్యూమర్‌కి లైఫ్ టైం ఆఫర్ ఇస్తున్నామన్నామని తెలిపారు. విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద కాలేజ్ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ హిమసాగర చంద్రమూర్తి మాట్లాడుతూ.. ఎల్లోపతి కాఫ్ సిరఫ్ వాడడం వల్ల ఏర్పడిన దుష్పరిణామాలు నివారించాలంటే ఆయుర్వేద విధానంలో తయారు చేయబడిన గోకాఫ్ సిరఫ్ వాడడం అత్యంత రక్షణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, బాలివుట్ నటీమణి నైనా గంగూలి మాట్లాడుతూ గోకాఫ్ పూర్తిగా ఆయుర్వేదంతో కూడుకుందని, హైలి ఎఫెక్టీవ్ అండ్ 100 శాతం సేఫ్ అని తెలిపారు.



పెన్షన్ కార్మికుల హక్కు : సిఐటియు

విజయవాడ : పెన్షన్ హక్కు.. ఎవరి దయాదాక్షిణ్యాలతో అందుకునేది కాదు.. మూడు, నాలుగు దశాబ్దాలకు పైగా వివిధ రంగాల్లో విస్తృత సేవలు అందించిన ఫలితంగా లభించే కనీస మొత్తం.. పెన్షన్ ఇవ్వడం యాజమాన్యాల బాధ్యత అని సిఐటియు సీనియర్ నాయకులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఏపీఆర్పీఏ) గౌరవాధ్యక్షులు పి. అజయ్ కుమార్ ఉద్ఘాటించారు. బుధవారం జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా స్థానిక ఎ.పి యు.టి.ఎఫ్. హాలులో ఎ.పి.ఆర్.పి.ఎ. ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక, పెన్షనర్ల వ్యతిరేక, పారిశ్రామికవేత్తల అనుకూల విధానాలనుసరిస్తోందని తెలిపారు. కార్మికులు హక్కుల సాధనకు పూనుకునే సందర్భంలో వారికి అండగా నిలబడటం యూనియన్ల బాధ్యత అని.. ఐక్య పోరాటాల ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి ప్రసంగిస్తూ కేంద్ర మోడీ ప్రభుత్వం అడ్డగోలుగా కార్మిక హక్కులను హరిస్తోందని నిరసించారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్ గా కుదించి పెన్షనర్లకు ఎంగిలాకులు మిగిల్చారని ఆవేదన చెందారు.ఈ నేపథ్యంలో పెన్షనర్లు మరింత ఐక్యతతో ఉద్యమాలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధానాల్లో భాగంగానే కేంద్ర ప్రభుత్వం పెన్షనర్స్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కార్మికుల న్యాయ పోరాటాలన్ని సందర్భాల్లో అండగా నిలబడుతున్న సిఐటియు జాతీయ మహాసభలు ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సందర్భంగా పెన్షనర్లు కూడా ఇతోధికంగా సాయం చేయాలని కోరారు. ఎ.పి.ఆర్.పి.ఎ. జిల్లా అధ్యక్షుడు అవనిగడ్డ పున్నారావు అధ్యక్షత వహిస్తూ- పెన్షనర్లంటే ప్రభుత్వ యంత్రాంగానికి చాలా చులకన భావం ఉందని సోదాహరణగా ఆవేదనతో వివరించారు. ఎం.ఎన్.పాత్రుడు తదితరులు పాల్గొన్న సభకు తొలుత జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసరావు స్వాగతం పలికారు.



ఇగ్నో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో జనవరి 2026 నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఆన్ లైన్ ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లమా, డిప్లమా అండ్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె. సుమలత బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే ఎం.ఏ సైకాలజీ కోర్సుకు కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ 2026 జనవరి 31 అని తెలిపారు. పీ.జి రెండవ సంవత్సరం, డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరం మరియు సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రీ-రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్ లైన్ ద్వారా 15 జనవరి, 2026 వరకు చెల్లించవచ్చని, ఇతర వివరాలకు ఇగ్నో వెబ్ సైట్ (www.ignou.ac.in) ని గాని లేదా కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

హోరాహోరీగా అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు

విజయవాడ రూరల్ : విజయవాడ సమీపంలోని నున్నలోని గ్రీన్ హిల్స్ మైదానంలో జరుగుతున్న 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్ఏపి) అండర్-17 బాలుర అంతర్ జిల్లా క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో ఆతిథ్య కృష్ణా జిల్లాతో పాటు కడప, గుంటూరు, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. లీగ్ మ్యాచ్‌లలో అద్భుతమైన ప్రదర్శనలతో ఈ జట్లు తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌ను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఎన్టీఆర్ జిల్లా నిర్వహిస్తోంది. దీనిని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (విజిటిఎన్) కార్యదర్శి, కరస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ ఛాంపియన్‌షిప్ గన్నవరం మండలం, నున్నలో రెండు మరియు సూరంపల్లిలో ఒకటి చొప్పున మూడు మైదానాల్లో లీగ్-కమ్-నాకౌట్ పద్ధతిలో జరుగుతోంది. ప్రారంభ మ్యాచ్‌లలో, కడప జిల్లా గుంటూరుపై 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. తూర్పు గోదావరి జిల్లా ప్రకాశంపై 102 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి, ఆ తర్వాత కృష్ణా జిల్లాపై 35 పరుగుల తేడాతో మరో విజయాన్ని నమోదు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. విశాఖపట్నం విజయనగరంపై సమగ్రమైన 10 వికెట్ల తేడాతో విజయం సాధించగా, గుంటూరు కర్నూలుపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. కడప జిల్లా కర్నూలును 47 పరుగుల తేడాతో ఓడించి తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. ఆతిథ్య కృష్ణా జిల్లా ప్రకాశంపై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు ప్రవేశించింది. కష్ణా బౌలర్ యశ్వంత్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, నాలుగు వికెట్లు పడగొట్టి తన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రారంభోత్సవంలో నరెడ్ల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, క్రీడలలో పాల్గొనడం విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కష్ణా జిల్లా కార్యదర్శి ఎం అరుణ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి టి శ్రీ లత, టోర్నమెంట్ పరిశీలకుడు డి. భూపాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ టి విజయ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అందెశ్రీకి ఘన నివాళి

విజయవాడ : ఆధునిక సమాజంలో మానవత్వాన్ని తట్టి లేపిన మహెూన్నత కవి, ప్రముఖ వాగ్గేయకారుడు అందెశ్రీకి బుధవారం గాంధీనగర్ కౌతా పూర్ణానందం హాలులో నివాళి కార్యక్రమం జరిగింది. ఊరూరా జన విజ్ఞానం, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి, తెలుగు కళావాహిని అధ్యక్షులు సీహెచ్. చిట్టిబాబు, ప్రముఖ గాయకులు కె.డేవిడ్ రాజు, లక్ష్మణ్ నాయక్, ఎ. జయప్రభు, ఎం.ఎం. వెంకటపతి పాల్గొన్నారు.



నిరాధార ఆరోపణలు తగవు : నాగుల్ మీరా

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : నిరాధారమైన ఆరోపణలు చేయటంలో వై.ఎస్.జగన్ రెడ్డిని మించిన వారు రాష్ట్రంలో ఇంకొకరు లేరంటూ రాష్ట్ర నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా విమర్శించారు. జోజినగర్‌లో ఇళ్ల కూల్చివేత కోర్ట్ ఆదేశాల ప్రకారం జరిగిందని, దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎంపీ కేశినేని శివనాథ్‌లకు ఏమి సంబంధమంటూ ప్రశ్నించారు. మాజీ సీఎం వై.ఎస్.జగన్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా బుధవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ సభలో ఎంపీ కేశినేని శివనాథ్ మెడికల్ కాలేజీ విషయంలో వైసిపి వైఖరిని ఎండగట్టినందుకే ఎంపీ శివనాథ్‌పై నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం జగన్ అవివేకానికి నిదర్శనం అన్నారు.





చెస్‌లో 'కాకతీయ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- నందిగామ : ఈ నెల 14న విజయవాడలో స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అండర్-16 విభాగం జిల్లా స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో స్థానిక కాకతీయ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. అండర్7 విభాగంలో తాటి దేవన్షి (అపోలో స్కూల్) ప్రథమ స్థానం, అండర్ 9 విభాగంలో తాటి తుషార (అపోలో స్కూల్) తృతీయ స్థానం, అండర్ 9 విభాగంలో ముహిబ్ అర్హామ్ (కాకతీయ సిబిఎస్ఇ) ద్వితీయ స్థానం సాధించారు. అండర్ 13 విభాగంలో బత్తుల హర్షిత్ (కాకతీయ సిబిఎస్ఇ) తృతీయ స్థానం పొందారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్, భారతి, డైరెక్టర్లు కార్తికేయ కాపా, సుష్మా కాపా, ప్రిన్సిపాల్ సత్యమూర్తి, హెచ్ఎం రాఘవులు అభినందించారు.



హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : బైక్ రైడర్ సహా పిలియన్ రైడర్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీసీపీ షరీన్ బేగం పేర్కొన్నారు. విజయవాడ ట్రోఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రజల్లో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో నగరంలోని ముఖ్యమైన కూడళ్లలో విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ క్రమంలో బుధవారం ప్రకాశం బ్యారేజీ వద్ద నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమంలో డిసిపి షరీన్ బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిపీ మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ పెట్టుకోనీ వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త డా. కొల్లేటి రమేష్ , అలాగే కార్యక్రమంలో భాగస్వామ్యమైన సంబంధిత కాలేజీ యాజమాన్యాలకు ట్రాఫిక్ పోలీసుల తరుపున ధన్యవాదాలు తెలిపారు.